## క్లుప్తంగా

### ఆర్థిక సాయం

**జగద్గిరిగుట్ట:** స్వచ్ఛంద సంస్థల నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ప్రేరణతో తాము కూడా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసుకున్నామని వీవీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కంగోజు బాల బ్రహ్మచారి అన్నారు. ఇటీవలే దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కూడా పూర్తి కావడంతో జగద్గిరిగుట్ట కొండపై ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం సంస్థ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్, కళ్యాణ సుందరంలకు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి కమ్మరి రాజు, కోశాధికారి కృష్ణమాచారి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా బీబీ పాటిల్ జన్మదిన వేడుకలు



**జగద్గిరిగుట్ట:** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ చైర్మన్ బీబీ పాటిల్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ప్రగతి శీల వీరశైవ సేవా సమాజం, బసవేశ్వర సమితి, తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్, విశ్వ లింగాయత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో పుట్టిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జగన్, దైవజ్ఞ శర్మ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**దుండిగల్:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ ఆల్విన్‌కాలనీ ప్రాంతానికి చెందిన వసంతరావు(45), రమేశ్‌లు స్నేహితులు. వీరిద్దరు వేర్వేరు పరిశ్రమలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. కాగా స్నేహితులు బైక్‌పై మేడ్చల్ నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు వస్తున్నారు. రమేశ్ బైక్ నడుపుతుండగా వసంతరావు వెనుక కూర్చున్నాడు. గండిమైసమ్మ సమీపంలోని బాలాజీ వైన్స్ వద్ద వీరి బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కాంక్రీట్ లారీ కింద పడింది. వెనుక కూర్చున్న వసంతరావు లారీ చక్రాల కింద పడడంతో అతని తలపై నుంచి లారీ వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర ప్రజలు

**సుభాష్‌నగర్:** రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌తోనే ఉన్నారని సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ వివేకానంద్‌కు మద్దతుగా మార్కండేయనగర్‌లో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల హామీలను ఓటర్లకు వివరిస్తూ మద్దతు తెలపాలని కోరారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా వివేకానంద్‌ను ఆశీర్వదించాలన్నారు. డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి, అరుణ తదితరులు ఉన్నారు.

### కలెక్టర్ అకస్మిక తనిఖీలు

**కుత్బుల్లాపూర్:** సుచిత్రలోని లయోల కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ కేంద్రంలో ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతం అకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులుకు సూచించారు.





# ఈ మలుపు.. యమపురికి పిలుపు!

**దుండిగల్:** ఓ ఇంటి పెద్ద చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడుతుంది. అంగవైకల్యానికి గురైతే ఆర్థిక భారంతో చిన్నాభిన్నమవుతుంది. భారంగా మారే కుటుంబ పోషణ.. పిల్లల చదువులు.. ఇలా ఆ కుటుంబం జీవించేందుకు దుర్భర పరిస్థితులు ఎదుర్కొవాల్సి వస్తుంది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతుంది. దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి వైపు వెళ్లే దారిలో శ్రీరామ్‌నగర్ మూల మలుపు వద్ద తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

- జీడిమెట్ల బస్ డిపో నుంచి దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఆర్ అండ్ బి అధికారులు రేడియల్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేశారు.
- కాని బహదూర్‌పల్లి ఎస్‌విబికె కన్వెన్షన్ హాల్ నుంచి గండిమైసమ్మ సమీపంలోని పోచమ్మ గుడి వరకు మాత్రం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదు.
- దీంతో వీటి మధ్య ఉన్న శ్రీరామ్‌నగర్ వద్ద ఇరుకైన మూలమలుపు వద్ద జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతో మంది తమ విలువైన ప్రాణాలను కొల్పోతున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

**ధర్నా చేసినా ఫలితం శూన్యం..**

నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో పదుల సంఖ్యలో వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజలు పలుమార్లు శ్రీరామ్‌నగర్ రోడ్డుపై బైఠాయించి ధర్నాలు సైతం చేశారు. స్థానికంగా ఉండే గాయత్రీ మిడోస్ అపార్ట్‌మెంట్ వాసులు ఎమ్మెల్యే, కమిషనర్, పోలీసులను కలిసి విన్నవించారు. అయినప్పటికీ ఎవరి నుంచి స్పందన లేదు.

**కోర్టు కేసు పేరుతో కాలయాపన..**

మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రైవేటు స్థలానికి సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉంది. దీనిని సాకుగా చూపిస్తు రోడ్డును వేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లామని, అధికారులు వచ్చి రోడ్డుకు ఇరువైపులా 13 ఫీట్ల మేర రోడ్డు వేయవచ్చని అంచనా వేశారన్నారు. ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదని పేర్కొంటున్నారు.



(ఫైల్ ఫొటో)
ధర్నా చేస్తున్న గాయత్రి మెడోస్ అపార్ట్‌మెంట్ వాసులు

**మచ్చుకు కొన్ని..**

- ఆగస్టులో స్కూల్ బస్సు యూటర్న్ తీసుకునే క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. అదృష్టవశాత్తు పెను ప్రమాదం ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న 12 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా అప్పుడే స్కూల్ బస్ కోసం వేచి చూస్తున్న ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి.
- ఫిబ్రవరిలో మేడ్చల్ నుంచి నగరానికి కార్మికులను తీసుకెళ్తున్న డిసిఎం డివైడర్ పైకి ఎక్కింది. ఈ ఘటనలో చంద్రమౌళి, కిరణ్‌లు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- ఆగస్టులో మూలమలుపు వద్ద ముందు వెళ్తున్న బైక్‌ను ఢీ కొట్టి లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనదారుడు చనిపోయాడు.
- గండిమైసమ్మలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకునే మన్మదరావు అనే యువకుడు డివైడర్‌ను ఢీకొని అక్కడిక్కడు మృత్యువాత పడ్డాడు.
- బహదూర్‌పల్లి నుంచి గండిమైసమ్మకు ఇద్దరు దంపతులు కారులో వెళ్తుండగా పక్కనే నాలా కల్వర్టులో కారు పడిపోయింది. ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి.
- పదిహేను రోజుల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి చనిపోయాడు.



శ్రీరాంనగర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు, చేపట్టని రోడ్డు వెడల్పు పనులు

**ప్రతి రోజూ ప్రమాదాలు**



మూలమలుపు వద్ద ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. మా అపార్ట్‌మెంట్‌లో ఉండే చాలా మందికి దెబ్బలు తగిలాయి. ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఉదయం పిల్లలను స్కూళ్లకు పంపించాలంటే చాలా భయంగా ఉంది. ఎమ్మెల్యే, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మా సొంత ఖర్చులతో నాలుగు టిప్పర్ల మొరం వేసుకున్నాం. ఇప్పటికైనా స్పందించి రోడ్డును వెడల్పు చేయాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, గాయత్రీ మిడోస్



(ఫైల్ ఫొటో)
ఢీ కొట్టుకున్న లారీ, స్కూల్ బస్సు



(ఫైల్ ఫొటో)
బోల్తాపడిన లారీ



(ఫైల్ ఫొటో)
డివైడర్ ఎక్కిన డీసీఎం



(ఫైల్ ఫొటో)
కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

## నీటి ఎద్దడి సమస్యను వెంటనే పరిష్కరించాలి

**నిజాంపేట్:** ప్రజల తాగునీటి కష్టాలు తీర్చని అధికార బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుతున్నారని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. ప్రగతినగర్‌లో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... గత తొమ్మిదేళ్లుగా పెరిగిన జనాభాను అనుగుణంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాలకు తాగునీటి సరఫరాను పెంచడంలో అటు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలమయ్యారన్నారు.

- ప్రగతినగర్ ప్రాంతానికి గత వారం రోజులుగా నీటి సరఫరా నిలిపివేశారన్నారు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతినగర్ ప్రాంత ప్రజల నుంచి వసూలు చేసిన రూ.69 లక్షల తాగునీటి బిల్లులను తక్షణమే వాటర్‌వర్క్స్‌కు కార్పొరేషన్ అధికారులు చెల్లించాలని, లేనిపక్షంలో అపరాధ రుసుం భారం నీటి వినియోగదారులపై పడుతుందన్నారు. తాగునీటి మోటార్లకు రిపేర్లు చేయించడంతో అదనంగా మరో రిజర్వాయిర్‌ను నిర్మించి రోజుకు 3 ఎంజీడీల తాగునీటిని అందించాలని తీర్మాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రమౌళి, కార్పొరేషన్ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ప్రతాప్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

### దర్గాగా సిలిండర్ల చోరీ

**గాలిస్తున్న కాలనీవాసులు**

**కుత్బుల్లాపూర్:** అయోధ్యనగర్‌లో గ్యాస్ సిలిండర్ల దొంగ చెలరేగిపోతున్నాడు. పట్టపగలే ఇంట్లోకి ప్రవేశించి కేవలం గ్యాస్ సిలిండర్లనే ఎత్తుకెళ్లడం విశేషం. జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్ నివాసితులు బాలరాజుగౌడ్, సత్యనారాయణ, మురళి, శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి ఇళ్లల్లో వారం రోజుల వ్యవధిలో ఈ ఘటనలు చోటు చేసుకోవడం కలకలం రేపుతోంది. పట్టపగలే ఇంట్లోకి ప్రవేశిస్తూ పక్క గదిలో ఇతరులు ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా ఇంట్లోకి చేరబడి ఆరు బయటపెట్టే గ్యాస్ సిలిండర్లను దర్జాగా ఎత్తుకెళుతూ వస్తున్నాడు. గత వారం రోజులుగా ఈ ఘటనలు చోటుచేసుకుంటున్న సిలిండర్ ఖరీదు రూ.1500 మాత్రమే కావడంతో పోలీస్‌స్టేషన్‌కు ఎందుకులే.. అనుకుంటూ దొంగ కోసం వేట ప్రారంభించారు. సీసీ కెమెరాలో స్పష్టంగా దొంగతనం జరిగిన విధానం చూస్తూ కాలనీవాసులు సదరు వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

### కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న వృద్ధురాలు ఆత్మహత్య

**జీడిమెట్ల:** కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ వృద్ధురాలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్‌పెక్టర్ పవన్ వివరాల ప్రకారం .. చింతల్ డివిజన్ న్యూవివేకానందనగర్‌కు చెందిన కె.వెంకటరావు భార్య లలిత(76) గత కొన్ని నెలలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. అప్పటి నుంచి మందులు వాడుతూ రెగ్యులర్‌గా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆదివారం ఉదయం లలితకు కుమార్తె పలుమార్లు ఫోన్‌చేసినా తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన కుమార్తె లలిత ఉంటున్న ఇంటికి ఆమె కుమారుడు సాయిని చూసి రమ్మని ఇంటికి పంపించింది. ఇంటికి వెళ్లిన సాయి తలుపు తట్టగా లలిత ఎంతకూ తలుపులు తీయలేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా లలిత ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. లలిత కుమార్తె భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అస్పత్రికి తరలించారు.

### శత వసంతంలోకి వెంకాయమ్మ



ఐదు తరాలకు చెందిన కుటుంబీకుల మధ్య జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్:** కొంపల్లిలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో ఆదివారం దంతలూరి వెంకాయమ్మ శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకాయమ్మ 1923లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా పోతుమట్ల గ్రామంలో జన్మించారు. 1923లో దంతులూరి వెంకటరాఘవరాజుతో వివాహమైన ఆమెకు 12 మంది సంతానం ఉన్నారు. ఐదు తరాలకు చెందిన 200 మంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కుమారులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్ల మధ్య వెంకాయమ్మ శత వసంత జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

## కబ్జాలపై ప్రశ్నిస్తే దాడులా?

**కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్**



బాచుపల్లి జేకే గార్డెన్స్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

**కుత్బుల్లాపూర్:** ప్రభుత్వ భూముల కబ్జాలను ప్రోత్సహిస్తూ ప్రశ్నించిన వారిపై రౌడీయిజాన్ని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యేను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో బాచుపల్లిలోని జేకే గార్డెన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శ్రీశైలంగౌడ్, గోవా బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సదానంద్ తన్వాడే, జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డిలు హాజరయ్యారు.

- ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే అయిన తనపైనే ఎమ్మెల్యే బహిరంగంగా దౌర్జన్యానికి దిగాడన్నారు. ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. ఓటమి భయంతోనే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి బీజేపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

జంగ్ తెలంగాణ 2023

**మన్‌కీ బాత్**

అంతకు ముందు ప్రధాని నరేంద్రమోడీ ‘మన్‌కీ బాత్’ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ ఆర్కే శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, పార్లమెంట్ కో.కన్వీనర్ రాజు, సులోచన, సుమన్‌రావు, అమలేశ్వరి, రామచంద్ర నాయక్, ప్రొఫెసర్ చంద్రమౌళి, బిక్షపతి, సుహాసిని, ప్రదీప్, బీజేపీ అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న శ్రీశైలంగౌడ్, రాజ్యసభ సభ్యుడు సదానంద్ తన్వాడే, పన్నాల హరీష్‌రెడ్డి

## అన్ని వర్గాల సంక్షేమమే మా ధ్యేయం

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్**

**కుత్బుల్లాపూర్:** అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని కౌసల్య కాలనీ, సాయి కృష్ణజా హిల్స్, కావ్య ఎవెన్యూ, సాయిఅనురాగ్‌కాలనీ, రేణుకాఎల్లమ్మ కాలనీ, నందనవనం కాలనీల్లో మేయర్ నీలారెడ్డితో, అదే విధంగా కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరి టవర్స్‌లో మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను అందజేస్తూ తనను మారోసారి దీవించాలని ఓటర్లను అభ్యర్థించారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ... హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ తెచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ సాధన దిశగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. నిజాంపేట్ 17వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.
- ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగారాయ ప్రసాద్, కార్పొరేటర్లు సురేష్‌రెడ్డి, ఆగం రాజు, గాజుల సుజాత, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అదే విధంగా చింతల్ డివిజన్ ఎస్ఎల్‌బీనగర్, పద్మశాలి బస్తీల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు పూర్తి మద్దతు ఇస్తూ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మాన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ రఫీ, మక్బూద్, కర్నెకంటి మల్లేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న బస్తీల సంక్షేమ సంఘం సభ్యులు





## ఆరు గ్యారెంటీలతో బీఆర్ఎస్‌కు ముచ్చెమటలు పడుతున్నాయ్

**కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి**

**కుత్బుల్లాపూర్:** కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో బీఆర్ఎస్ పార్టీకి ముచ్చెమటలు పడుతున్నాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సూరారం డివిజన్ పరిధి సూరారం కాలనీకి చెందిన చందు ముదిరాజ్, చింతల్ డివిజన్ వివేకానంద్‌నగర్, రోడామేస్త్రీనగర్‌లకు చెందిన షేక్ షఫీ, ఆర్.లక్ష్మి, గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్ రాయల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద సంఖ్యలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి హన్మంతరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

- అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోనియా గాంధీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు నెరవేర్చేందుకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని తమ సొంత జాగిరుగా మార్చుకుని దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కమిషనర్ల కోసం కక్కుర్తి పడి మేడిగడ్డ బ్యారేజీ నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారన్నారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం నీటిపాలయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కుండువాలు కప్పుతున్న కొలన్ హన్మంతరెడ్డి

## ప్రచారంలో కూన శ్రీశైలంగౌడ్‌కు అనూహ్య స్పందన

**నిజాంపేట్:** బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు ఎన్నికల ప్రచారంలో ప్రజల నుండి అనూహ్య స్పందన వస్తోంది. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లోని హైరైజ్ పీవీఆర్ మీడోస్, ప్రకాష్ ప్రైమ్ గేటెడ్ కమ్యూనిటీలలో ఆదివారం పర్యటించిన శ్రీశైలంగౌడ్‌కు కాలనీవాసులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా పలువులు యువకులు, కాలనీవాసులు బీజేపీకి మద్దతుగా పార్టీలో చేరగా ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ నాయకులు పెండ్లిమడుగుల శ్రీనివాస్‌గౌడ్, అతిష్ బాబు, నర్సింగ్‌రావు, నవీన్, మురళి బాబు, ప్రకాష్ ప్రైమ్ గేటెడ్ కమ్యూనిటీ అధ్యక్షుడు పెండ్లిమడుగుల భారత్ తేజ గౌడ్, హైరైస్ పీవీఆర్ మీడోస్ అధ్యక్షురాలు పద్మ ప్రియ తదితరులు ఉన్నారు.

### ఎన్నికల కోడ్ నేపథ్యంలో...

**సుభాష్‌నగర్:** శాసనసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జీహెచ్ఎంసీ, రెవెన్యూ శాఖ పనులను ముమ్మరం చేసింది. కొన్ని రోజులుగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్డు, బస్తీ కూడళ్లలో గోడలపై ఉన్న రాతలను చెరిపి వేసింది. ఆయా పార్టీలకు చెందిన బ్యానర్లు, జెండాలను సైతం ఎప్పటికప్పుడు తొలగిస్తోంది. ప్రస్తుతం ఆయ పార్టీల చెందిన నేతల విగ్రహాలకు ముసుగులు వేస్తుంది.



షాపూర్‌నగర్ చౌరస్తాలో విగ్రహాలకు ముసుగు వేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029